# కత్తుల పంజరం

పారిజాతానికి వుద్యోగం చేయాల్సిన అవసరం ఎంతమాత్రం లేదు. అంచేత చచ్చీ చెడి చదివి తాను డిగ్రీలు సంపాదించుకోవాల్సిన అవసరం లేదని ఆమె విశ్వాసం. అయినా వూళ్ళోనే కాలేజీ వుండటంవల్ల స్నేహితురాళ్ళతో కాలక్షేపం అవుతుందని అందరితోపాటు కాలేజీలో చేరింది. పరీక్ష పాసు కావాలనుకోలేదామె. అందుకు తగ్గ ప్రయత్నమూ ఎన్నడూచేయలేదు. ఏదో మొక్కుబడిగా ఏయేటికాయేడు పరీక్షలు వ్రాసి వచ్చేది. అయినా ఆమె పరీక్షలు పాసయింది. "బిఏ" అన్న డిగ్రీని పేరుకి తగిలించుకునే అర్హతను సంపాదించుకొంది. అప్పటి నుంచే ఆమెకు చిక్కులు ఆరంభమయ్యాయి!

"డిగ్రీలు వుద్యోగం చేయటంకోసమే కాదమ్మాయ్. మనలాంటి వాళ్ళ కవి ప్రెస్టేజ్ సింబల్స్. "పారిజాతం, బి. ఏ" అని రేపు బోర్డు కట్టేవనుకో, అది మన స్టేటస్‌కి ఎంతతక్కువ? పూలుపూయని పారిజాతం చెట్టుకున్నంత విలువకూడా లేదు. యీ రోజుల్లో డిగ్రీకి. అదే "పారిజాతం, యమ్మే" అని బోర్డు కట్టేవనుకో, నీ పేరుకు, నిన్నుకన్న తల్లిదండ్రులకు, నిన్ను చేసుకున్న భర్తకు, బోర్డు కట్టిన ఆ యింటిగోడకి కూడా విలువ కాస్తంత వస్తుంది. అదే "డాక్టర్ పారిజాతం, యమ్మే., పి. హెచ్. డి" అని బోర్డు కట్టేవనుకో ఆ తర్వాత ఏ లెక్చరర్

వుద్యోగంలోనో చేరి, పేరు కింద హోదాను కూడా తగిలించావనుకో విరగ బూసిన పారిజాత వృక్షంలా నీ పేరు, నువ్వు, నేను....శోభిస్తాము."

హాయిగా తెలుగు ఇంగ్లీషు నవలలు చదువుకొంటూ, సినిమాలు చూస్తూ, పెళ్ళి చేసుకొని మొగుడితో షికార్లు చేద్దామని కలలుగంటున్న పారిజాతానికి తండ్రి మాటలు ఎంతమాత్రం రుచించలేదు. "యీయనకు యిదేంపిచ్చి ?" అనుకొంది.

పారిజాతంతండ్రి పరమేశ్వరజాన్‌కి డిగ్రీలులేవు. ఒకరికింద ఉద్యోగం ఎన్నడూ చేయలేదు. అందుకు కాంపెన్‌సేషనా అన్నట్లు డిగ్రీలన్నా, ప్రభుత్వ వుద్యోగాలన్నా ఆయనకు ప్రేమ. ఆయనకు బోలెడంత డబ్బు, పలుకుబడి వున్నాయి. అవి ఆయన స్వార్జితాలు. తనలాగే డబ్బు సంపాదించే వాళ్ళన్నా, పలుకుబడి పెంచుకొనేవాళ్ళన్నా ఆయనకు అసహ్యం.

రెండేళ్ళు అష్టకష్టాలుపడి పారిజాతం ఎలాగోలాగు ఎమ్మేకూడా అయింది. ఆ తర్వాత తండ్రి రీసెర్చి అంటాడేమోనని భయపడింది. పెళ్ళి చేయమని తనే అడిగేసింది.

పారిజాతం భర్త కరుణకుమార్ ప్రభుత్వ కళాశాలలో లెక్చరర్. పేరుకు ముందు "డాక్టర్", పేరు తర్వాత ఎమ్మేస్సీ, ఎమ్మీడి, పి. హెచ్. డి" ఇత్యాది డిగ్రీలున్నవాడు. డిగ్రీలు కాని, డబ్బుకాని సంపాదించటం అన్నీ మాబాగా తెల్సినవాడు. ట్యూషన్లు భారీయెత్తున చెప్తాడు. గైడ్లు, మేడ్ ఈజీలు వ్రాసి స్వంతంగా ప్రచురించుకొని డబ్బుచేసుకోగల వ్యాపార దక్షత వున్నవాడు.

ఎమ్మే చదివిన భార్య ఇంట్లో ఊరికే నాన్ ప్రొడక్టివ్ ఆబ్జెక్ట్‌లా కూర్చోటం అతనికి నచ్చలేదు. ఎంత డబ్బుంటే మటుకు ఇంకా సంపాదించటం చేదా ? ఎంత సంపాదిస్తే అంత గొప్పకదా ? అవకాశమున్నప్పుడు ఎందుకొదులుకోవాలి ?

అయినా ఉద్యోగం చేయమని భార్యను మొదట్లో నేరుగా అడగ లేదు. ఆమెకు బద్ధకం జాస్తి. సుకుమారం హెచ్చు. ఉద్యోగం చేయట మంటే మండిపడుతుంది. అంచేత మామగారి వైపు నుండి నరుక్కు వచ్చాడు.

"నా తండ్రి ధనవంతుడు. నా మావగారు అంతకన్నా ధనవంతుడు. డబ్బు కోసం నా భార్య వుద్యోగంచేయాలని అనుకోటం లేదు మామగారూ నేను. నా భార్యకూడా లెక్చరర్ అంటే నాకు గొప్ప సోషల్‌గా నా స్టేటస్ పెరుగుతుంది. ఏమంటారు ?"

మామగారిదగ్గర గ్రీన్‌సిగ్నల్ పుచ్చుకొని భార్యతో బేరంపెట్టేడు. బుజ్జగిస్తూ ప్రేమప్రదర్శనలుచేస్తూ, లాలిస్తూ, స్త్రీలు వుద్యోగం చేయటం వల్ల గల లాభాలను నూరిపోసేడు. భర్త అభిప్రాయాన్ని గ్రహించింది పారిజాతం.

"ఎందుకండీ ? నేను వుద్యోగంచేయాల్సినంత అవసరం మనకే ముంది ? అనవసరపు హైరాన ! నన్నడిగితే మీరూ ఆ వెధవ వుద్యోగం మానేయండి. యించక్కా మీరు ఎప్పుడూ నా ఎదుట వుండటం నాకు యిష్టం. డబ్బులేనివాళ్ళకు వుద్యోగాలుచేయక ఎలాగూ తప్పదుగా ? మన కేం ఖర్మ ?"

పారిజాతానికి హ్రస్వదృష్టి. తాత్కాలానికి మాత్రమే ఆలోచిస్తుంది. దీర్ఘకాలికదృష్టి లేదు. భవిష్యత్తును గురించి ఆలోచించదు. యిద్దరూ కూర్చొని తింటే కొండమాత్రం కరిగిపోదూ ? పైగా రేపు కుటుంబం పెరగదూ ? రేపు సంగతలా వుంచినా యిప్పుడు మాత్రం ? యిద్దరూ సంపాదిస్తే చేదా ? స్కూటర్ బదులు కారు కనుక్కోవచ్చు. పాతయిల్లు అద్దెకిచ్చేసి "అప్‌టుడేట్"గా బ్రహ్మాండమైన కొత్తయిల్లు కట్టుకోవచ్చు. ఒక్క ఫ్రిజ్‌కు బదులు గదికొకఫ్రిజ్ అమర్చుకోవచ్చు. గదికో టెలివిజన్

యిల్లంతా ఎయిర్ కండిషన్....డబ్బుండాలిగాని అనుభవించటానికి సుఖాలే కరువా ? అంత ఎక్కువైనరోజున బాత్‌రూమ్‌ని బంగారంతో కట్టుకోవచ్చు. రూపాయినోట్లతో అంచక్కా కాఫీ కాచుకుని తాగవచ్చు. ఏమిటో పారిజాతం పిచ్చి ?

యిలాంటి భావనలను ఎంతో అందంగా, సున్నితంగా, తియ్యగా పూరిస్తూ చెప్పగా చెప్పగా పారిజాతం కాస్త మెత్తబడింది. అంతలోనే ఆమెకు భయమేసింది !

"యమ్మే పాసయ్యానన్నమాటేకాని నేను చదివిందే తక్కువ. అందులో తలకు ఎక్కింది మరీ తక్కువ. దానిలోనూ యిప్పుడు జ్ఞాపకమున్నది జీరో. నాకెవరు వుద్యోగం యిస్తారు ? యిచ్చినా నేనేం పాఠాలు చెప్పగలను ? వద్దండీ ! ప్లీజ్——"

కరుణకుమార్ భార్యను మరింత ప్రేమగా దగ్గరికి తీసుకొన్నాడు.

"పిచ్చిపిల్లా. తెల్సి తెలియని వాళ్ళకన్నా అసలు ఏమీ తెలియని వాళ్ళు జ్ఞానులు. తమకు అన్నీ తెల్సుననుకొనే వాళ్ళకన్నా ఏమీ తెలియవనుకొనేవాళ్ళు మహాజ్ఞానులు. చాలామంది లెక్చరర్లు అలాంటి జ్ఞానులో, మహాజ్ఞానులో. నీకేమీ తెలియకపోతే విద్యార్థుల్ని ఏమీ చెడగొట్టలేవు. అదే మహోపకారం. అంచేత ఆ దిగులు, అధైర్యం వద్దు——"

"మరి క్లాసులో ఏం చెప్పాలి ?"

"నీకు తెల్సిందిచెప్పు. నీకేం తెలియదనుకో, నువ్వు నవలలు చదువుతావు. సినిమాలు చూస్తావుగదా ? వాటినిగురించే చెప్పు. రెండోరోజుకల్లా నువ్వు పాపులర్ టీచర్‌వి కాకపోతే నేను చెవి కోయించుకొంటాను. యిక వుద్యోగం యిచ్చే వాళ్ళెవరంటావా - ఆ విషయం నా కొదిలెయ్".

అతను పనిచేసే వూళ్ళో ప్రభుత్వ కళాశాల కాక ప్రైవేట్ మేనేజ్‌మెంటు ఆధ్వర్యంలో నడిచే కాలేజీ అది. రాజు తల్చుకుంటే దెబ్బలకి

కొదవా? ఆ కళాశాలలో ఖాళీ లేకపోయినా కొత్త పోష్టుకు అవసరం క్షణంలో ఏర్పడింది. అందుకు ప్రభుత్వ అనుమతి లభించింది. గ్రాంటు కూడా క్షణంలో శాంక్షన్ అయింది.

ఆ ఉద్యోగాన్ని భర్తీ చెయ్యటానికి దరఖాస్తులు కోరుతూ పత్రికలలో ప్రకటన వెలువడింది!

........................

........................

ఆ ప్రకటన చూచి డాక్టర్ చక్రపాణి అలవాటుగా అప్లికేషన్ పడేశాడు. ఇంటర్వ్యూకి రమ్మని పిలుపు వచ్చినప్పుడు దిక్కుతోచక దిగాలు పడ్డాడు!

హాజరు కావటానికి డబ్బు లేదు. మానేద్దామంటే ఆశ వదలదు!

ప్రైవేటు కాలేజీ ఇంటర్వ్యూల ఫార్సులు అతనికి బాగా తెల్సు. జీతం యివ్వకపోగా చందాగా కాలేజీకి ఎదురు ఎన్ని వేలు యిస్తావని అడిగేరు కొందరు. జీతం లేకుండా ఎన్నేళ్ళు పనిచేస్తావని కొందరు, వంద యిస్తామని కొందరు....ముందే సెలెక్ట్ చేసుకు పెట్టుకున్నవాళ్లు మరి కొందరు. తెలుగు మాస్టరు వుద్యోగానికి వచ్చిన వాడిని లెక్కలు చెప్ప గలవా అని అడిగేవారు కొందరు....ఇంటర్వ్యూ ఓ పద్మవ్యూహం.

అయినా అవసరం ఎప్పటికప్పుడు ఆశని బ్రతికిస్తుంటుంది. ఆడిస్తుంటుంది.

అందరు నిరుద్యోగుల కథల్లాంటిదే చక్రపాణిదికూడా. రీసెర్చ్ చేసి డాక్టర్ అయ్యాడంటే అది అతని వెనుకవున్న డబ్బు ప్రతిభ కాదు, స్వీయ ప్రతిభ. డబ్బు అవసరం.

రీసెర్చ్ డిగ్రీకన్నా యల్డీసీ వుద్యోగం అతనికి అవసరం. వాటి పరస్పర విలువలు అతనికి తెల్సు. అంచేత డిగ్రీ అన్నా రాకముందునుంచి

అతను ఏదో వుద్యోగానికి ప్రయత్నం చేస్తూనేవున్నాడు. వుద్యోగం రాక, స్కాలర్‌షిప్పు రూపంలో వచ్చే డబ్బుకు ఆశపడి, యమ్మే చదివేడు. రీసెర్చి కూడా గ్రేంటు డబ్బుల కోసమే చేశాడు. అదీ అయ్యాక నిరుద్యోగుల జాబితాలోకి ఎక్కక తప్పలేదు.

ఉద్యోగ సంపాదన అతనికి జీవన్మరణ సమస్య. అయితే కొన్ని ఉద్యోగాలకి దరఖాస్తు పెట్టటానికూడా బోలెడంత పెట్టుబడి కావాలి. అలాంటివాటి జోలికి యిప్పుడు పోడు చక్రపాణి. వొక్క తెల్లకాగితం ఖర్చుతో సరిపోయే వుద్యోగాలని ప్రిఫర్ చేస్తాడు. ముప్పైఅయిదు పైసల కవరు ఖర్చుకు వెనకాడడు.

ఎప్పటికప్పుడు ఆఖరి ఇంటర్వ్యూ అనుకోటం, మళ్ళీ పోవల్సి రావటం. తిప్పలు! అలవాటుగానే ఎన్నో తిప్పలుపడి ఇంటర్వ్యూకి వచ్చాడు ఇప్పుడు. అక్కడ వందల సంఖ్యలోవున్న అభ్యర్థులని చూచి బెదిరిపోలేదు. ప్రతిభను గుర్తించేవారు యింత పెద్దప్రపంచంలో వొక్కరన్నా వుండరా అన్నది అతని ఆశ!

ఎక్కడో జరిగిన ఇంటర్వ్యూ ఫార్సులని చెప్పుకొని నవ్వుకొంటున్నారు కొందరు. నిరుద్యోగ పర్వంలో సీనియారిటీలు చెప్పుకొంటున్నారు కొందరు.

ఇంటర్వ్యూ ప్రారంభమైంది. లంచ్ వేళకి ముప్పాతికభాగం మందికి ఇంటర్వ్యూ అయిపోయింది. వాళ్ళు చెప్పుకొనేదాన్నిబట్టి యీ యింటర్వ్యూ కూడా ఫార్సేనని తేలిపోయింది. అంటే ఇంతమందిలో ఎవరికో ముందే ఆ వుద్యోగం రిజర్వు అయిందన్నమాట! తవకు చార్జీలు దండుగ! బాధ ...ఆవేశం....కోపం....తిరుగుబాటుతత్వం.... !

డాక్టర్ చక్రపాణికి లంచ్‌కివెళ్ళే శక్తి లేదు. ఆ అవసరమూలేదు. యీ ఆలోచనలతోనే అతని కడుపు నిండిపోయింది. మండిపోతోంది!

యింతకీ యింతమందిలో కల్సిపోయివున్న ఆ అదృష్టవంతుడు లేక అదృష్ట వంతురాలెవ్వరో ?

ఇంటర్వ్యూ తంతు తిరిగి ప్రారంభమవటానికి పదినిమిషాల వ్యవధి వుంది. కాలేజీ ఆవరణలో స్కూటర్ ఆగింది. కరుణకుమార్ భార్యకు ధైర్యం చెప్పి ప్రేమగా భుజం తట్టి మళ్ళీ ఓ అరగంటలో వచ్చేస్తానని స్కూటర్ స్టార్టు చేసుకుని వెళ్ళిపోయాడు. పారిజాతం తల వంచుకుని అడుగులో అడుగు వేస్తూ మెల్లగా నడిచి వచ్చి ఖాళీగా వున్న ఓ కుర్చీలో కూర్చుంది.

చక్రపాణి పారిజాతాన్ని చూచి మొదట్లో అక్కడ లెక్చరర్‌గా చేస్తున్నదేమో ననుకొని బాధపడ్డాడు. యిప్పుడు ఇంటర్వ్యూకి వచ్చిందని తెల్సుకొని భయపడ్డాడు. అదృష్టవంతురాలని "స్పాట్ అవుట్" చేయగలిగేడు. కానీ, ఎంత ఘోరం ?

"పారిజాతం మీరుకూడా ఇంటర్వ్యూకే వచ్చారా ?"

పారిజాతం తల యెత్తి చక్రపాణిని చూసింది. ఆమె కళ్ళలో ఆశ్చర్యపు వెలుగు ! అంతలోనే సిగ్గు; బిడియం, భయం !

"డాక్టర్ పాణీ మీకింకా ఉద్యోగం చిక్కలేదా ?"

ఆమె కంఠంలో సానుభూతి, కళ్ళల్లో ప్రేమ. అతనికి ఓ ఆలోచన చటుక్కున తట్టటానికి ప్రేరణలయ్యాయి. కడుపులో మంట ఆజ్యమయింది!

"స్కూటర్ మీద మిమ్మల్ని దించి వెళ్ళినతను మీ భర్త కరుణ కుమార్ అనుకొంటాను. సారీ. డాక్టర్ కరుణకుమార్ కదూ ? ఏంచేస్తున్నారు. ధనవంతులేగా ?"

"అవును. ఈ వూళ్ళోనే కాలేజీలో లెక్చరర్."

ఇంటర్వ్యూలు తిరిగి ఆరంభ మయ్యాయి.

"మీనుంచి ఓ సహాయాన్ని కోరుదామనుకుంటున్నాను పారిజాతం. కోరమంటారా ?"

ఎమ్మే చదువుతుండగా చక్రపాణి తనకు చేసిన సహాయం గుర్తొచ్చింది పారిజాతానికి. అప్పుడతను అక్కడ రీసెర్చ్ స్కాలర్. ప్రొఫెసర్‌కు అతనంటే అమిత అభిమానం - గౌరవం. అంచేత చక్రపాణికి యమ్మే క్లాసులుకూడా అప్పచెప్పేడు. చక్రపాణి పాఠం ఎంత బాగా చెప్పేవాడు ? నవలలు, సినిమాలు తప్ప తలకెక్కని తనకుకూడా పాఠాల్లో విషయంపట్ల అభిరుచి కలగచేసేదే ? అయినా పునాది ఏదీ ? ఫలితంగా మొదటి సంవత్సరం మార్కులు చాలా తక్కువ వచ్చాయి.

"మిస్ పారిజాతం యువతీయువకులు ప్రేమించిన వారందరినీ వరించలేకపోవచ్చు. కానీ చదువు వుంది చూచారూ ! తనను ప్రేమించిన వారందరినీ వరిస్తుంది. ప్రేమించుకోటానికి, వరించుకోటానికి, మనుషుల్లో కులాలు, హోదాలు, డబ్బు యిలా ఎన్నో అడ్డంకులు. కానీ చదువు వరించటానికి ఇలాంటి అభ్యంతరా లేమీ వుండవు. తనదగ్గర చదువుకొన్న విద్యార్థులందరూ చదువుకొని వృద్ధిలోకి రావాలని మన ప్రొఫెసర్‌గారి కోరిక. మీరు చదువును కాస్త ప్రేమించండి. చదువు మిమ్మల్ని బాగా ప్రేమిస్తుంది. ప్రొఫెసర్‌గారి సహాయం ఎలాగూ వుంటుంది."

ఎంత సున్నితంగా తన నిర్లక్ష్యాన్ని మందలించాడు ? అతని మాటలు వింటుంటే అతడినే వరించాలన్నంత కోరిక పుట్టిందామెకు. చదువుల సరస్వతి అతను. చదువు తననే వరించేబదులు చదువుల సరస్వతిని తనే వరిస్తే సరిపోలే !

"నిజంచెప్తున్నాను మాస్టారూ. డిగ్రీ నాకు నామభూషణంమాత్రమే క్లాసులు సంపాదించుకొని ఏంచేయాలి ?"

"అంటే మీకు వుద్యోగ అవసరం లేదంటారా ?"

"లేదు" అంటూ పారిజాతం తన కథ చెప్పింది అతనికి.

"అలా చూచుకొన్నా ఫస్టుక్లాసు డిగ్రీ అవుతే నామభూషణం విలువ

పెరుగుతుందిగదా ? వన్నెనుబట్టేకదా బంగారం విలువ ! అయినా అసలు మీరు పాసుకావాలన్నా చదవాలిగా ? మేస్టర్ల దయాధర్మాలమీద ఆధార పడితే ఎలా ?"

"నాకు పాఠాలంటే బోర్ అండీ. మీలాంటి వాళ్ళు చెప్తుంటే సర్దాగావుండి అర్థమవుతుంది. అందరు లెక్చరర్లు మీలాగా చెపితే నాలాంటి వాళ్ళకూ్కడా చదువుపట్ల అభిరుచి కలుగుతుంది. పోనీ మీరు నాకు ట్యూషన్ ఎందుకు చెప్పకూడదు ?"

"మీకు ఆ శ్రద్ధ వుంటే చెప్పనన్నానా ?"

కాలేజీలోనే తీరిక సమయంలో ఆమెకు ప్రత్యేకంగా అదనపు క్లాసులు చెప్పేడు. నెలయ్యాక జీతం ఇవ్వబోయింది. అతను నవ్వుతూ తల అడ్డంగా వూపేడు.

"ప్రతిఫలం వాంఛించేది సహాయం కాదు. మీరు మంచిమార్కులతో పాసు కావటమే మీనుంచి నేను కోరే ప్రతిఫలం."

"కానీ...."

"నన్ను అవమానపర్చకండి. నేను బీదవాడిని, నిరుద్యోగినికావచ్చు. కానీ అన్నిదానాలలోకి విద్యాదానం గొప్పది. అలాంటి దానాన్ని జీవితంలో ఒక్కరికైనా చేసేనన్న తృప్తి నాకు వుండనివ్వండి."

అతను పాఠం చెప్తున్నంతసేపు ఆమె 'మంత్రముగ్ధురాలిలా వినేది. అతడిని ప్రేమిస్తున్నట్లు చెప్పాలని, పెళ్ళి చేసుకోమని అడగాలని కోరిక కలిగేది. కానీ అతను కంటి ముందు లేనప్పుడు వాస్తవం గుర్తుకొచ్చేది. బీదవాడిని చేసుకొని శ్రీమంతుల ఆడపిల్లలు కష్టపడుతుంటే పుస్తకాలలో చదివేవారికి ఆనందంగా వుంటుంది. వారిపైన సానుభూతి చూపటంలో ఓ థ్రిల్ వుంది. కానీ తను నిజంగా ఆ బాధల్ని భరించగలదా ? అమ్మో !

పరీక్ష లయిపోయాయి. మంచి మార్కుల్ని చూచుకొన్నప్పుడు

చక్రపాణి గుర్తుకొచ్చాడు. పెళ్ళి చేయమని తండ్రిని అడిగినప్పుడు మళ్ళీ లీలామాత్రంగా గుర్తుకొచ్చేడు. పెళ్ళయ్యాక అసలు ఎన్నడూ తల్చుకొనే లేదు. యిన్నాళ్ళ కిన్నాళ్ళకు యిలా నిరుద్యోగిగా తటస్తపడి సహాయాన్ని కోరుతానంటున్నాడు. ఏమిటో ?

చక్రపాణి తన కుటుంబ పరిస్థితి చెప్పేడు. తన ఇంటి దారిద్ర్యాన్ని వర్ణించేడు. తన కుటుంబ బాధ్యతల్ని ఏకరువు పెట్టేడు.

"మా ఇంట్లో తినేనోళ్ళు చాలా వున్నాయి. సంపాదించేశక్తి వున్న వాడిని నేనొక్కడినే. నేను వొక్కడినినైనా సంపాదించకపోతే ముసలి ముతకలు, చిన్నపిల్లలతోసహా అందరి కడుపులూ కాల్తాయి. నోళ్ళు ఆక్రోశిస్తాయి. గుండెలు మండుతాయి. ఆకలి నీరసాన్ని మర్చిపోయి సమాజాన్ని దేశాన్ని తిట్టిపోస్తాయి. అలాగే యింకాకొంతకాలం జరిగేక నిరాశ పేరుకు పోతుంది. ఆలోచనల్ని, విచక్షణాజ్ఞానాన్ని, నీతి నియమాల్ని, ధర్మాధర్మాలను చంపేస్తుంది. గుడ్డివాళ్ళని చేస్తుంది. ఆ స్థితిలో మా కుటుంబం విప్లవం అంటూ దోపిడీలకి, హింసలకుదిగితే అది ఎవరితప్పు ? నాతప్పా? మా కుటుంబ సభ్యులందరి తప్పా ? లేక కుటుంబానికి కనీసం ఒక్క వుద్యోగాన్నన్నా కల్పించని ఈ ప్రభుత్వ వ్యవస్తదా ?"

అతని పాయింటు పారిజాతానికి బోధ పడింది. తనకి వుద్యోగం వస్తుందని అతను పసిగట్టేడు. ఆ వుద్యోగం తనకి అవసరంలేదని, కేవలం "లగ్జరీ" అని అతనికి తెల్సు. అతనికి, అతని కుటుంబానికి ఆవుద్యోగం అవసరం. అంచేత ఆవుద్యోగాన్ని నువ్వు వదులుకొని నాకు యిప్పించమని అడుగుతున్నాడు.

పారిజాతానికి అతని కోరిక సబబుగా కన్పించింది. పైగా తనకు ఎప్పుడో చేసిన సహాయానికి ప్రతిసహాయం చేయటం తన ధర్మంకాదూ ? దానివల్ల తనకు లాభమే. యీజన్మలోనే ఋణవిముక్తురాలైపోతుంది.

అసలు అతనే సహాయం చేయకపోతే తను యమ్మే పాసయ్యేదా ? యీ ఇంటర్వ్యూకి వచ్చేదా ? అంత ఆత్మాభిమానాన్ని వొకప్పుడు ప్రదర్శించిన అతను యివాళ యిలా సహాయాన్ని అర్థిస్తున్నాడంటే పాపం అతని అవసరం అర్థంకావటంలేదూ ? జాలి వేసింది పారిజాతానికి.

"అవును. నేను కోరే సహాయం అదే. యిదేమిటి వీడు వుద్యోగాన్ని బిచ్చం అడుగుతున్నాడనుకోకండి. నేను యాచించటంలేదు. అలాగే వొకనాడు మీకు చేసిన సహాయానికి ప్రతిఫలాన్ని కూడా కోరటంలేదు. మీకు నా వాదనలో సబబు కన్పిస్తేనే త్యాగాన్ని చేయండి. "నాలాంటి" వాళ్ళు నిరుద్యోగుల్లా వుండటం సోషల్ ట్రాజెడీకదూ ? "మీలాంటి" వాళ్ళు లెక్చరర్లు కావటం గొప్ప అకెడమిక్ ఫార్స్ కాదూ ? ఉన్న వాళ్ళ దగ్గరనే డబ్బు అంతా పోగవుతున్నట్లు, వుద్యోగాలూ వున్నవాళ్ళకే వూడిగం చేయటం సామాజికధర్మమేనా? కుల మత ప్రసక్తులు లేకుండా ధనిక వర్గంవారు, లేనివర్గంవారిని లౌకికంగా చేస్తున్న దోపిడీ కాదంటారా యిది ?"

పారిజాతానికి లోపలినుంచి పిలుపు వచ్చింది. ఆమె లేచింది. ఇంటర్వ్యూ అయిపోయి నట్టుంది. చక్రపాణి వొక్కడే మిగిలిపోయాడు.

"మిసెస్ పారిజాతం సోషల్ జస్టిస్ మీద నమ్మకంవుంటే, ఆ వుద్యోగం నాకక్కర్లేదని, అందుకు అర్హుడైన వ్యక్తి, అవసరమైన వ్యక్తి బయట వున్నాడని చెప్పండి."

"సహాయం కోరుతానని ప్రారంభించి, సోషల్ జస్టిస్ అని శాసిస్తాడేం ? "నాలాంటి" "మీలాంటి"—ఏమిటో తన గొప్ప ? తను లెక్చరర్ ఉద్యోగం చేయటం పొర్పుట ! ఎంత అవమానం ? ఎంత గర్వం. ఎవరు ఉద్యోగానికి అర్హులో క్షణంలో తెల్వదూ ?"

"కూర్చోండి మిసెస్ పారిజాత కరుణకుమార్‌గారూ. కాఫీ బోరన్

వీటా ఇత్యాది తీసుకొనే అలవాటుందా లేక కూల్‌డ్రింక్స్ తెప్పించమంటారా ? మీనాన్నగారుకూడా పొద్దున ఫోన్ చేశారు. ఏంప్రశ్న లడగమంటారు మిమ్మల్ని ?" అధ్యక్షుడు ఇంటర్వ్యూ ప్రారంభించాడు. ఏం ప్రశ్నలడగమని చెప్పాలో బోధపడలేదు పారిజాతానికి. అప్పుడు శెక్రటరీ అందుకొన్నాడు.

"అతనెవరో చాలాసేపటినుంచి మీతో మాట్లాడుతున్నట్లున్నాడు. మీకు తెల్సా ? ఏం చెప్తున్నాడు ?"

"తెల్సు, యూనివర్శిటీలో యమ్మే చదివేరోజుల్లోనే తెల్సు. అప్పుడు "చదువు పిచ్చి" వాడనుకొనేవాళ్ళం. యిప్పుడు వుద్యోగం కోసం నక్సలైట్‌గాకూడా మారినట్లున్నాడు. ఏమేమిటో మాట్లాడి నన్ను భయపెట్టేడు"

బయటస్కూటరాగిన శబ్దమయింది. సభ్యులందరూ లేచి పారిజాతానికి వీడ్కోలిచ్చారు. ఆమె వెళ్తూ డాక్టర్ చక్రపాణి వైపేనా చూడలేదు. స్కూటర్ ఎక్కి చక్రపాణిని వేలుపెట్టి భర్తకు చూపించింది. స్కూటర్ వెళ్ళిపోయింది.

"ఇంటర్వ్యూ అయిపోయింది. మీరు వెళ్ళవచ్చు" ప్యూనువచ్చి చక్రపాణితో అన్నాడు.

"అదేమిటీ ? మరీఇంతఅన్యాయమా ?" ప్యూనుని కాదని అతను లోపలికి ప్రవేశించాడు.

"బాబూ ఆవేశపడకు. మా కాలేజీలో నక్సలైట్లకు వుద్యోగాలివ్వం"

"నక్సలైట్లా ! ?"

"కాదని నిరూపించుకోవాలనుకొంటే యిరవై వేలు డొనేషన్ కట్టు. ఉద్యోగం యిస్తాం. ఆలోచించుకొని వో వారంలో డబ్బు పట్టుకురా. వెళ్ళు" సభ్యులులేచి వెళ్ళిపోయారు. డాక్టర్ చక్రపాణి ఒక్కడూ గదిలో మిగిలేడు. ఆగది అతనికి వో పెద్దజైలులా కన్పించింది ! కత్తుల పంజరంలో వున్నట్లు గిలగిలలాడి పోయాడు ! వ్యవస్థ అతడిని పరిహసిస్తోంది!

(స్వాతి - ఆగస్టు 1981)